అలంకారమే.. ఆడింది శూన్యమే!

'గ్రామీణ యువతలో క్రీడానైపుణ్యతను ప్రొత్సహించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. లక్షల రూపాయాల నిధులు ఖర్చు చేసి నిర్మించినా క్రీడామైదానాలు నిరూపయోగంగా మారిపోయాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఖర్చులకు నిధులుగా మారాయి తప్పిస్తే వాటివల్ల ప్రయోజనం కనిపించని దుస్థితి గ్రామాల్లో నెలకొంది'.

- అక్కరకు రాని క్రీడాస్థలాలు, పరికరాలు
- ప్రజాధనం నిష్ప్రయోజనం
- గ్రామాలకు దూరంగా మైదానాలు



విఠలాపూర్ గ్రామపంచాయతీలోని క్రీడాప్రాంగణం

కుల్కచర్ల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో గ్రామానికి ఒక క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. అందుకు అవసరమైన నిధులను జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా సమకూర్చింది. కాని, ఈ మైదానాల వల్ల ఎవరికీ లబ్ధిచేకూరని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామపంచాయతీల్లో బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపించారు. మరికొన్ని గ్రామాల్లో క్రీడామైదానాల్లో ఒక్కరోజు కూడా ఆడిన దాఖలలు లేవు.. కేవలం అలంకారప్రాయంగా మారాయి.

ఒక్కో క్రీడాప్రాంగణానికి రూ.50 వేలు

కుల్కచర్ల మండలంలో 44 గ్రామపంచాయతీలు ఉండగా అన్ని గ్రామాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ 50వేల చొప్పున నిధులు, 20గుంటల స్థలంలో క్రీడాప్రాంగణాలను నిర్మించారు. కొన్ని గ్రామాల్లో స్థలం లేని కారణంగా, 10గుంటల స్థలంలో ఏర్పాటు చేశారు. కొందరు సర్పంచులు స్థలాన్ని చదును చేసే క్రమంలో జీపీ నిధులతో క్రీడాప్రాంగణానికి అధిక మొత్తంలోనూ నిధులు ఖర్చు చేశారు. వీటిలో వ్యాయామానికి రెండు పోల్స్, రెండు వాలీబాల్ పోల్స్ వేయాల్సి ఉండగా వ్యాయామానికి సంబంధించిన పోల్స్ తప్ప వాలీబాల్‌కు సంబంధించిన పోల్స్ ఎక్కడ కూడా కనిపించడం లేదు.

దూరభారంతో నిష్ప్రయోజనం..

మండల పరిధిలోని క్రీడా ప్రాంగణాలు ఒకటి, అర తప్పిస్తే ఏ ఒక్క గ్రామ పంచాయతీ పరిధిలో ఉపయోగకరంగా నిర్మించిన దాఖలాలు లేవు. గ్రామానికి దూరంగా క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేయడంతో అవి ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కుల్కచర్ల గ్రామ పంచాయతీలో క్రీడాప్రాంగణం గ్రామానికి 5కిలోమీటర్ల దూరం ఉండగా, విఠలాపూర్, చౌడాపూర్, కామునిపల్లి, బోట్యానాయక్ తండా, రాంనగర్, దాస్యనాయక్ తండా తదితర గ్రామాల్లో దూరంగా నిర్మించడంతో అలంకారప్రాయం ఉన్నాయి. ప్రజాధనం నిష్ప్రయోజనంగా మారింది.

దగ్గరగా ఉంటే ప్రజయోజనం



క్రీడాప్రాంగణాలు గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. క్రీడా స్థలం గ్రామంలో ఉంటే ఉదయం వ్యాయమాలు చేసేందుకు, క్రీడలు ఆడుకునేందుకు క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ స్థలంలోనైనా గ్రామంలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేయాలి.

– పిట్ల నరేష్, క్రీడాకారుడు, కుల్కచర్ల

వినియోగంలోకి తీసుకువస్తాం..



గ్రామాల్లో స్థలం లభించని పరిస్థితిలో కొద్దిదూరంగా నాడు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించిన స్థలంలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం వాటి చుట్టూ మొక్కలు పెట్టి వాటిని ఆధునీకరించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, ఏపీఓ, కుల్కచర్ల

ధరణి దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తుదారుడి నుంచి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

దుద్యాల్: పెండింగ్ ధరణి దరఖాస్తులను మూడు రోజుల్లో 140 పరిష్కరించినట్లు తహసీల్దార్ దానయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. చాలా రోజులుగా పరిష్కారం కాని 240 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం కలెక్టర్ ప్రతీక్‌జైన్, డిప్యూటీ రెవెన్యూ కలెక్టర్ లింగ్యానాయక్‌లు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, పరిష్కార మార్గాలు వివరించడంతో, మండల రెవెన్యూ అధికారులు దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచారు. ధ్రువపత్రాలు సరిగ్గా ఉన్న 140 పరిష్కారం అయ్యాయని మిగతా వాటికి సరైన ధ్రువపత్రాలు లేవని తెలిపారు.

ఇంటింటికీ తిరుగుతూ దరఖాస్తుల పరిశీలన

మండలలోని పలు గ్రామాలకు సంబంధించిన దరఖాస్తుల్లో సరైన ధ్రవపత్రాలు లేకపోవడంతో ఏకంగా దరఖాస్తు దారుని ఇంటికి వెళ్లి రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. అందులో భాగంగానే మండలంలోని హకీంపేట గ్రామంలో శనివారం ఆర్ఐ రవీందర్‌చారి, సిబ్బంది నర్సింలు ఇంటింటికి తిరుగుతూ దరఖాస్తు పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి


కోట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో టీ సాట్ బోధన

ఎంఈఓ చంద్రప్ప

వికారాబాద్: విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంలో రాణించేందుకు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. శనివారం దూరదర్శన్ టీ సాట్ ఛానల్‌లో సైన్స్ బోధనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రప్ప మాట్లాడారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు దూరదర్శన్ టీ సాట్‌లో వచ్చే సైన్స్ బోధన ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతిరోజు ఉ.10 నుంచి 11 గంటల వరకు దూరదర్శన్ ఛానల్‌లో శాస్త్ర సాంకేతిక రంగంపై పలు అంశాలు ప్రసారమవుతాయన్నారు. విద్యార్థుల ఇన్స్‌పైయిర్ అవార్డులకు సైన్స్ బోధన ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా తిలకించి సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీ నర్సింలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమలో భారీ వర్షం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు

దోమ : మండల వ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. శనివారం సాయంత్రం ఏకదాటిగా కురిసిన భారీ వర్షానికి రైతులు సాగు చేసిన పంటలకు ఉపశమనం కలిగింది. మండల పరిషత్ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయం ఎదుట భాగంలో వర్షపు నీరు నిలిచింది. దీంతో కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. కార్యాలయం ముందు భాగంలో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా సీసీ వేయడంతోనే నీరు నిలిచిందని ఆయా గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆలయ దుకాణాలు సీజ్


దుకాణాలను సీజ్ చేస్తున్న అధికారులు

పరిగి: పట్టణ కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వస్వామి ఆలయ దుకాణాల అద్దె విషయం రాజకీయ రంగు పూసుకుంది. దుకాణదారులు అద్దెకట్టడం లేదని శనివారం దేవాదాయ శాఖ అధికారులు దుకాణాలను సీజ్ చేశారు. దీంతో దేవాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆలయం దేవాదాయ శాఖలో లేకుండా కేవలం బీఆర్ఎస్ నాయకుల ఆధీనంలో ఉంది. దీంతో అద్దె ఆలయ కమిటీ సభ్యులు వసూలు చేసేవారు. కాని కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో ఆలయాన్ని దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి అద్దెలు దేవాదాయ శాఖకు చెల్లించాలని అద్దెదారులకు నోటీసులు జారీ చేశారు. అయినా ఎవ్వరూ అద్దెను దేవాదాయ శాఖకు చెల్లించకపోవడంతో, అధికారులు దుకాణాలకు తాళం వేసి సీజ్ చేసే ప్రయత్నం చేస్తుండగా అద్దెదారులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అద్దెదారులు, ఆలయకమిటీ మెంబర్లు దేవాదాయశాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దుకాణాలను సీజ్ చేసే విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సపోర్ట్ చేయడంతో ఆలయంలో రాజకీయ రంగు పులుముకుందని పలువురు చర్చించుకున్నారు. అద్దెకడితేనే దుకాణాలు యథావిధిగా కొనసాగుతాయని ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

యాలాల: పంచాయతీలో రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని ఎంపీఓ యాదయ్య కార్యదర్శులకు సూచించారు. శనివారం మండలంలోని దౌలాపూర్ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పన్నుల వసూలు, వ్యయం రికార్డులు, జీపీ సిబ్బంది వేతనాల వివరాలు, హాజరు పట్టికను పరిశీలించారు.ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు.

కంప్యూటర్ విద్యలో రాణించాలి

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న డీఎస్పీ

తాండూరు: కాలానికి అనుగుణంగా కంప్యూటర్ విద్యలో విద్యార్థులు రాణించాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. శనివారం తాండూరులో బీఆర్.అంబేడ్కర్ కంప్యూటర్ సాక్షర్తా మిషిన్ ఆధ్వర్యంలో వేసవిలో కంప్యూటర్ విద్యలో ఉచిత శిక్షణ పొందిన 60 మంది విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను బాలకృష్ణారెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలానుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు రావడం సహజమే అన్నారు. అందుకు తగ్గట్లుగా విద్యా ప్రమాణాలను పెంచుకోవాలన్నారు. ఎన్ని ప్రమాణాలు వచ్చిన కూడా చదవడం, రాయడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మనాభరెడ్డి, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు నర్సప్ప, నిర్వాహకులు ,విద్యార్థులు తదితరులున్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్


పరిగి: జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు


అనంతగిరి: నివాళులర్పిస్తున్న నాయకులు

బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కులరహిత సమాజం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.


తాండూరు: బీజేపీ కార్యాలయంలో ..


తాండూరు: బాబు జగ్జీవన్‌రామ్‌కు చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకుల నివాళి


కుల్కచర్ల: బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఘనంగా శ్యామ్‌ముఖర్జీ జయంతి


గ్రామంలో మొక్కలు నాటుతున్న నేతలు


పరిగి: జయంతి వేడుకలో నాయకులు

కుల్కచర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో శ్యామ్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, కుల్కచర్ల మండల బీజేపీ అధ్యక్షుడు సూర్యకాంతంలు మాట్లాడుతూ.. బానిస సంకెళ్ల నుంచి బయటపడేందుకు అందరిని సమైక్యపరచడంలో శ్యాంముఖర్జీ చూపిన చొరవ ఎంతో గొప్పదన్నారు. పెద్దల గౌరవార్థం ప్రతీ ఒక్కరూ ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి ఆంజనేయులు, అనంతయ్య, నాయకులు ఉన్నారు.

ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

పరిగి: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయసాధనకు నిరంతరం కృషి చేస్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు అన్నారు. భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాధ్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఒకే దేశం.. ఒకే చట్టం ఉండాలని దేశంలో రెండు జెండాలు, రెండు చట్టాలు ఉండకూడదని ఆక్రోషించారు.

మొక్కలు నాటేందుకు సిద్ధం


ఈత చెట్లు నాటేందుకు సిద్ధంగా ఉన్న చెరువు కట్ట

దుద్యాల్ : గతంలో గ్రామాల్లో ఈత చెట్లను విచ్చలవిడిగా పెంచేవారు. కానీ రానురాను ఈత చెట్లపై మక్కువ తగ్గడంతో అవి అంతరించి పోయే ప్రమాదం ఏర్పడింది. అటవీశాఖ అధికారులు నీటి ధార కల్గిన ప్రభుత్వ స్థలాల్లో ఈత వనాలను పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని ఆలేడ్ గ్రామ చెరువు వెడల్పుగా ఉండడంతో అదివారం మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ సిబ్బంది, కూలీల సహాయంతో ఆలేడ్ చెరువు కట్టపై ఉన్న ముళ్ల చెట్లను తొలగించి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచారు. దీంతో అటవీశాఖ అధికారులు ఆదివారం ఈత మొక్కలు నాటుతామన్నారని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా ఉపాధ్యాయులకు వీడ్కోలు

ధారూరు: మండలంలోని స్టేషన్‌ధారూరు గ్రామ పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. బదిలీ అయిన శ్రీనివాస్, సరిత, నర్సింహులు, నరసింహారాజులకు పాఠశాలలో శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మానించి వీడ్కోలు పలికారు.

◆ విద్యతోనే భవిష్యత్ :ఎంఈఓ చంద్రప్ప

వికారాబాద్ : విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంఈఓ చంద్రప్ప ఆకాంక్షించారు. శనివారం మండలంలోని బొప్పునారం, బస్వాపూర్, తొర్మామిడి పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చూసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు.

◆ మిషన్‌భగీరథ పైప్‌లైన్ లీకేజీ

పూడూరు: గ్రామాలకు తాగునీరు అందించే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మండల పరిధిలోని హైదరాబాద్ –బీజాపూర్ జాతీయ రహదారి కేశవరెడ్డి పాఠశాల పక్కన పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరంతా రోడ్డుపై పారుతుంది. పదిరోజులు కావస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

◆ ఆంజనేయస్వామికి పూజలు

కొడంగల్ రూరల్ : పట్టణశివారులోని సిద్ధనొంపు ఆంజనేయస్వామికి శనివారం హిందూవాహిని, ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి, భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ శనివారం హిందూవాహిని ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తూ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించేవారు. నేటి శనివారం 41వ వారాన్ని పురస్కరించుకొని 54పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

◆ సేవా కేంద్రంతో లబ్ధి: ఎంపీఓ

వికారాబాద్ : మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలనలో 6 గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ పథకాలు పొందనట్‌లెతై ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

◆ జీపీ వర్కర్ల వేతనాలు చెల్లించాలి

వికారాబాద్ : గ్రామ పంచాయతీ వర్కర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాల పోషణ భారమైందన్నారు. ఇప్పటికే పలుసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఖాతాదారుల కిటకిట

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో ఖరీఫ్ సీజన్ కారణంగా ఖాతాదారుల కిటకిట కొనసాగుతోంది. బ్యాంకు ఖాతాదారులు నిత్యం పొదుపు, అప్పులతో పాటు మహిళా సంఘాల సభ్యులు, రైతులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. మాఫీకి ముందు చెల్లింపులు చేసుకునేందుకు ఖాతాదారులు పోటీ పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్రాంచ్‌లో వినియోగదారులతో నిండిపోతుంది. రోజుకు 500మందికి పైగా ఖాతాదారులు, వినియోగదారులు సేవలు అందుకుంటున్నారు.

◆ లాభసాటి నిర్ణయాలకు మద్దతిస్తాం

ఏఎంసీ డైరెక్టర్ నర్సింహులు గౌడ్

యాలాల: రైతులకు లాభదాయకమైన మార్కెట్ కమిటీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని ఏఎంసీ నూతన డైరెక్టర్ ఈడ్గి నర్సింహులు గౌడ్(పగిడియాల) పేర్కొన్నారు. తాండూరు ఏఎంసీలో డైరెక్టర్‌గా తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీలో రైతులకు అవసరమైన వసతులు, సౌకర్యాల కల్పనకు ఎప్ప టికప్పుడు పాలకవర్గ దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

◆ యువకుడికి సన్మానం

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల్లోని యువకులలో నైపుణ్యాలకు కొదువ లేదని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల గ్రామానికి చెందిన డప్పు శ్రీనివాస్ గురుకులం టీజీటీలో ఉద్యోగం పొందిన నేపథ్యంలో భీంరెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో యువకులకు అనేకమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ


దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

అనంతగిరి: అంగన్‌వాడీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతూ శనివారం అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. జీఓ నంబర్ 10ను రద్దు చేయాలన్నారు. 65 సంవత్సరాలు పైబడిన అంగన్‌వాడీ టీచర్లుకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలన్నారు. ప్రతినెల పెన్షన్ రూ.8 పెన్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, అంబాబాయి, భారతమ్మ, నర్సమ్మ, పోచమ్మ తదితరులు ఉన్నారు.

మూడు గంటలకే అంగన్‌వాడీ మూత


దుద్యాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం

దుద్యాల్ : అంగన్‌వాడీ నిర్వాహకులు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 3గంటలకే అంగన్‌వాడీ కేంద్రాన్ని మూశారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న 6వ అంగన్వాడీ కేంద్రం ఉ. 9గంటల నుంచి సా. 4 గంటల వరకు కొనసాగాలి. సంబంధిత అధికారులు పర్యవేక్షణ కరువవ్వడంతోనే అంగన్‌వాడీ కేంద్రాలు నిర్లక్ష్యంగా నడుస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్


తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్న చైర్మన్

పరిగి: తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని 13వ వార్డులో నీటి సమస్య ఉండటంతో శనివారం బోరు తవ్వించి మోటారును బిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రతి ఇంటికి తాగు నీరందిస్తామన్నారు. ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణ, తాహేర్, అన్వర్, హన్మంతు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీపీని తనిఖీ చేసిన ఆడిట్ బృందం


కుల్కచర్లలోని నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

కుల్కచర్ల: ఇండియన్ అకౌంటెంట్ అండ్ ఆడిట్ సర్వీసెస్ అకౌంట్ జనరల్ కేంద్ర అధికారుల బృందం శనివారం కుల్కచర్ల గ్రామ పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులు, నర్సరీ, పల్లెప్రకృతి వనం, ఎవెన్యూ ప్లాంటేషన్ తదితర ప్రాంతాలను సందర్శించారు. మండల పరిధిలోని కుల్కచర్ల, బండవెల్కిచర్ల, సాల్వీడు, ముజాహిద్‌పూర్, చౌడాపూర్ గ్రామాల్లో ఈ బృందం అడిట్ నిర్వహించనున్నది. శనివారం కుల్కచర్లలో గ్రామపంచాయతీని సందర్శించారు. మరో రెండురోజుల అనంతరం అభివృద్ధి పనుల నిర్వహణ, నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహించనున్నారు. ఈ బృందంలో బాలకృష్ణ నల్లమోతు, పీయూష్‌కుమార్ రాయ్, శేఖర్, గౌతమ్ కుమార్, రాజేంద్రప్రసాద్, శంకర్‌నాయక్, కుల్కచర్ల ఎంపీఓ ఖరీం, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ తదితరులు ఉన్నారు.